## తల్లిని చూచి కౌగిటికి తార్చి రమింపగ వచ్చె నయ్యెడన్

ఎంత మూర్ఖుడికైనా తల్లికి, చెల్లికి, చెలికి భేదం తెలుస్తుంది. అలా తెలియలేదంటే వాడు ఏ అనాగరక, ఆటవిక, ఆదిమానవ జాతికో చెందినవాడు కావాలి. ఎవడో ఒక 'ప్రబుద్ధుడు' తన తల్లిని చూచి ఆమెను కౌగలించుకుని ఆమెతో సరసం సాగించాడట. ఇలా ఎక్కడైనా జరుగుతుందా? (అవధానాల్లో, ఆశు కవిత్వాల్లో తప్ప) కన్నతల్లిని కామించినవాడిని సమర్థిస్తూ పద్యం చెప్పాలట. లేదంటే ఇంకో పద్ధతిని అనుసరించాలి! ఈ సమస్య నిజంగానే ఒక సమస్య.

### పూరణ

తల్లిని చూచి, ఆమెను కౌగిలించుకొని ఒక ప్రబుద్ధుడు ఆమెతో సంసార సుఖం అనుభవించాడట. ఇదెంత అన్యాయం! కన్నతల్లిని కామించినవాడిని సమర్థిస్తూ పద్యం చెప్పాలట. ఇది ఎవరికైనా బాగుంటుందా? దీన్ని అవధాని తెలివిగా పూరించారు.

పల్లవ పత్ర పుష్ప ఫల భాసురమైన వసంత వేళరా
నుల్లములోని మోహభర నేరక పాండురాజు వి
ద్యుల్లత వోలె కట్టెదుట నొప్పెస లారెడు ధర్మ పుత్రు మా
ద్రల్లిని జూచి కౌగిటికి తార్చి రమింపగ వచ్చె నయ్యెడన్

భారత కథ ఆధారంగా ఈ సమస్యాపూరణ జరిగింది. ముని శాపంవల్ల పాండురాజు దాంపత్య సుఖాన్ని పొందే అవకాశం కోల్పోయాడు. సంసారం చేస్తే చచ్చిపోతాడన్నదే ఆ శాపం. అందుచేత కుంతి, మాద్రి అతనికి ఆ అపాయం రాకుండా తెలివిగా మసలుకుంటున్నారు. అయినా విధి లీల విచిత్రం కదా! ఒక రోజున పాండురాజు మాద్రితో కలిసి విహారానికి పోయాడు. అది వసంత కాలం. ప్రకృతి చాలా అందంగా వుంది. అంత అందమైన ప్రకృతిలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కని భార్య పక్కనుండగా పాండురాజు చలించిపోయాడు. శాపం గీపం పక్కనబెట్టి మాద్రితో సంగమించాడు. అక్కడే చనిపోయాడు. ఆ సందర్భాన్ని ఆధారం చేసుకుని 'ధర్మపుత్రు మారుతల్లిని' అంటే ధర్మరాజుకి మారుటి తల్లి (సవతి తల్లి) అయిన మాద్రితో పాండురాజు సంసారం సాగించాడని పూరించి అశ్లీలాన్ని తొలగించారు.

### వచ్చే వారం సమస్య

## మురియన్ చొప్పుడు నీ వరాంగ మెపుడే ముద్దాడ నా కబ్బునే?

ప్రియురాలితో ప్రియుడు పలికిన మాట ఇది. ప్రేయసీ! ముద్దులొలికే నీ అంగాన్ని ముద్దాడే అవకాశం నాకెప్పుడైనా కలుగుతుందా అంటున్నాడు.

తెలుగు చాలా విచిత్రమైన భాష. కొంచెం సంస్కృతాన్ని ఆశ్రయిస్తే చాలా పదాలకి రెండేసి అర్థాలు వస్తాయి. వాటిని ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. అలాటి వీలుండడం చేతనే కొన్ని సందర్భాల్లో కవులు 'అశ్లీలత' అనే గండం నుంచి తప్పించుకుంటున్నారు. అలాటి సౌకర్యం వున్నదే ఈ సమస్య. దీన్ని శ్రీ కాకర్ల కొండలరావుగారు 'శ్లేష' ఆధారంగా పూరించారు. పూరణ వచ్చే వారం.

—సేకరణ: పి.జగన్నాథరావు

## చిరు కిరణం

సుమారైన పట్టణంలో, నాలుగు రోడ్ల కూడలి. ఏదో 'షేవింగ్ బ్లేడు' అడ్వర్టయిజ్‌మెంట్ కాబోలు... హోర్డింగ్ చాలా 'భారీ'గా వుంది. మొలదగ్గర తప్ప, శరీరంపై మరెక్కడా ఆచ్ఛాదన లేకుండా వున్న ఓ అందమైన యువతి, తలుపు సైజులో వున్న బ్లేడు అంచుపై అలవోకగా పడుకొన్న పోజు... జనాన్ని ఇట్టే ఆకర్షిస్తోంది.

ఓ పల్లెటూరి యుకుడు... టౌనుకి కొత్త కాబోలు... ఆ హోర్డింగ్ వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. కాసేపయ్యాక ఓ వ్యక్తిని అడిగాడు. "ఆ బొమ్మేందన్నా?"... ...

చిన్నగా నవ్వాడావ్యక్తి. యాభై ఏళ్లవయస్సులో, బాగా నలిగి పోయినట్లున్నాడు... "మేడి పండు నాయనా!" అని బదులిచ్చాడు. కాసేపు చూసి వెళ్ళబోతున్న స్కూటర్‌వాలా నడిగాడా ప(ల్లెటూరి) యువకుడు. "మెత్తటి కత్తి బ్రదర్!"... ఈలేసుకుంటూ వెళ్లిపోయాడా స్కూటరిస్టు. 'అసలా బొమ్మలో కత్తే లేందే?!'... ఆశ్చర్యపోయాడా 'ప... యువకుడు'.

'కోక డాబు'... అని ఒకరూ, 'కాగితం పూవు'... అని మరొకరూ ఇలా ఏవేవో జవాబులిస్తున్నారా 'ప... యువకుడి' ప్రశ్నకి.

ఇంతలో అటుకేసి పోతున్న ఓ నిరుద్యోగి యువకుడిని అడిగాడా యువకుడు. "అన్నా... అదేం బొమ్మ?!"

జవాబేమీ చెప్పలేదా 'ని (రుద్యోగ) యువకుడు. ఆ నాలుగు రోడ్ల కూడలిలో హాయిగా విశ్రాంతి తీసుకొంటున్న 'బర్రె'ల దగ్గర కెళ్లి, అక్కడున్న 'పేడ'ని తీసుకొచ్చి కసిగా, ఆ హోర్డింగ్ కేసి కొట్టాడు. మరోసారి... మూడు... నాలుగుసార్లు కొట్టి ఆయాసంగా ఆగిపోయాడు.

'ఠప్!...' మని ఆ హోర్డింగ్‌కి తగిలిందో రాయి. వెనక్కి తిరిగి చూశాడు. ఒంటిపై నుంచి జారిపోతున్న 'లాగు'ని ఎగలాక్కుంటూ వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ పరిగెడు తున్నాడో కుర్రాడు.

అదంతా గమనించిన ఆ 'ప... యువకుడి' కళ్లు విచిత్రంగా మెరిశాయి. దోసిళ్లతో పేడ తెచ్చి, ఆ హోర్డింగ్ కేసి విసిరాడు.

పవన్